

ఆలయాల్లో శివరాత్రి ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లను ఎస్‌పికి వివరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - రామచంద్రపురం

ఈనెల 26 న జరగనున్న మహా శివ రాత్రి ఏర్పాట్లను ఎస్‌పి బివి.కృష్ణారావు శని వారం పరిశీలించారు. ద్రాక్షారామ భీమేశ్వ రాలయం లోనూ, కోటిపల్లి సోమేశ్వర స్వామి శివాలయాన్ని ఆయన సందర్శించి రానున్న శివరాత్రి ఏర్పాట్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ద్రాక్షారామ, కె.గంగవరం పోలీసులకు శివరాత్రి సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో మరింతగా నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట రామచంద్రపురం డిఎస్‌పి రఘువీర్, సిఐ, వెంకటనారాయణ, ద్రాక్షారామ ఎస్ఐ లక్ష్మణ్, గంగవరం ఎస్ఐ జానీ బాషా తదితరులు ఉన్నారు.

చిక్కుల్లో చేనేత

- పెరుగుతున్న ముడి సరుకు ధర
- గిట్టుబాటు ధర గగనం
- పాలక వర్గాలు లేక కుదేలు
- హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ప్రభుత్వాలు మారుతున్నా చేనేత కార్మికుల తలరాతలు మారడం లేదు. పాలకులు అనుసరిస్తున్న విధానాలతో ఈ రంగం నానాటికీ తీసికట్టుగా మారింది. ముడి సరుకుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దీంతో గిట్టుబాటు ధర గగనంగా మారుతోంది. గత ప్రభుత్వం మాదిరిగానే కూటమి ప్రభుత్వంలోనూ ఆప్కోకు పాలక వర్గం ఏర్పాటు కాలేదు. స్థానికంగా ఉన్న సహకార సంఘాలకు అధ్యక్షులు ఉంటారు. వీరు జిల్లాకు ఒక డైరెక్టర్‌ను ఎన్నుకుంటారు. ఆ తర్వాత ఆప్కోకు ఛైర్మన్ వస్తారు. అయితే ఇంత వరకూ పాలక వర్గం ఊసే ప్రభుత్వం ఎత్తక పోవడంతో అధికారుల ఇష్టారాజ్యంగా మారిపోయింది. సరైన పర్యవేక్షణ లేక, దీనిపై అధికార యంత్రాంగానికి పూర్తిస్థాయిలో అవగాహన లేక చేనేత రంగం చితికిపోతుంది.

ఉమ్మడి జిల్లాలో 50 సహకార సంఘాల్లో సుమారు 30 వేల మంది చేనేత కార్మికులుగా నమోదయివున్నారు. అలాగే మాస్టర్ వీవర్స్ వద్ద స్వయం ఉపాధి చేసుకుంటున్న వారు మరో 40 వేల మంది వరకూ ఉన్నారు. అధికారులు లెక్కల ప్రకారం వీటి పరిధిలో 15,700 మగ్గాలు ఉన్నాయి. ఇందులో సహకార రంగంలో 11,980, సహకారేతర రంగంలో 3,720 మగ్గాలున్నాయి. యు.కొత్తపల్లి మండలంలోని అమినాబాధ, మూలపేట, గొల్లప్రోలు, ఇదే మండలంలోని తాటిపర్తి, చేబ్రోలు, ప్రత్తిపాడు మండలం ధర్మవరం, తుని, అమలాపురం, బండారులంక, కడియం మండలం దుళ్ల, వీరవరం, విలసవిల్లి, పుల్లేటికుర్రు, అంబాజీపేట, సఖినేటిపల్లి, ఉప్పలగుప్తం తదితర ప్రాంతాల్లో పలు కుటుంబాలు నేత పనిపైనే ఆధారపడి జీవిస్తున్నాయి.

పెరుగుతున్న ముడి సరుకు ధర

కరోనా తర్వాత నుంచి చేనేత రంగం మరింత పతనానికి గురియైంది. రెండేళ్ళ కరోనా దెబ్బతో చేనేత కార్మికులు అల్లాడిపోయారు. నాడు అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఈ రంగాన్ని గట్టెక్కించలేకపోయింది. ముడి సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పాటు నేసిన చీరలను కొనేవారు లేక కార్మికులు అష్టకష్టాలు పడ్డారు. ఆ ప్రభావం నేటికీ వీరిని వెంటాడుతూనే ఉంది. మరోవైపు చేనేతలకు అండగా నిలిచే మాస్టర్ వీవర్స్ బతుకులు కూడా దుర్భరంగా మారిపోయాయి. ముడిసరకు ధరలకు తోడు పెరుగుతున్న విద్యుత్తు ఛార్జీల భారం కూడా నేతన్నల నడ్డి విరుస్తోంది. ఈ నేపథ్యంలోనే మగ్గాలనే నమ్ముకుని బతుకులు వెళ్లదీస్తున్న వేల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రభుత్వం నుంచి ఆశించిన స్థాయిలో కార్మికులకు ప్రోత్సాహం లేకపోవడంతో సమస్యలు ఇంకా పెరుగుతున్నాయి. గతంలో కిలో పట్టు రూ.2,800 ఉండేది. ఆ తర్వాత రూ.5 వేలకు పెరిగగా ప్రస్తుతం రూ.8 వేలు అయింది. జరీ రూ.325 ఉండేది. ఇప్పుడు రూ.500 నుంచి 600, రంగులు 150-170 ఉండేవి. ఇప్పుడు రూ.300 నుంచి 500కి పెరిగాయి.

నేతన్న నేస్తం కోసం ఎదురు చూపులు

గత వైసిపి ప్రభుత్వం నేతన్న నేస్తం పేరుతో ప్రతి ఏటా సాయం అందించడంతో ఆ కుటుంబాలన్నీ ఈ వృత్తిని కొనసాగించుకుంటూ జీవనం సాగించే పరిస్థితి ఏర్పడింది. 2023 జులైలో కోనసీమ జిల్లాలో 4,279 మందికి, కాకినాడ జిల్లాలో 2,778 మందికి, తూర్పుగోదావరి జిల్లాలో 916 మందికి నేతన్న నేస్తం చివరిసారిగా అందించారు. అయితే ఇంకా అనేక మందికి ఈ పథకం అందాల్సి ఉంది. ప్రభుత్వ విధానాల వలన చేనేత కార్మికుల బ్రతుకుల్లో మార్పులు రావడం లేదు. నేతన్న నేస్తం ద్వారా గుడ్డిలో మెల్లలా కాస్త ఉపయోగం ఉన్నప్పటికీ ముడి సరుకుల ధరలు విపరీతంగా పెరగడంతో కార్మికులకు ఉపాధి తగ్గుతూ వస్తుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి 8 నెలలైనా నేతన్న నేస్తం ఇవ్వడం లేదు. రోజంతా కుటుంబం మొత్తం కష్టపడితే రూ.300 మించి కూలీ కూడా రావడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేనేత రంగం కుదేలు అవుతున్న నేపథ్యంలో చాలా మంది ఇతర రంగాల వైపు మళ్లుతున్నారు.

చేనేత రంగాన్ని ఆదుకోవాలి



గతంలో రోజుకి రూ.600 నుంచి రూ.800 వరకూ కూలీ వచ్చేది. ప్రస్తుతం రోజుకి 10 గంటలు కష్టపడుతున్నా రూ.300 మించి కూలీ రాని పరిస్థితి ఏర్పడింది. చేనేత రంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలి. గత ప్రభుత్వం ఇచ్చిన విధంగా ఎటువంటి నిబంధనలు లేకుండా నేతన్న నేస్తం అర్హులైన వారందరికీ అందివ్వాలి. అలాగే ఆప్కోకు పాలకవర్గాలను తక్షణమే ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.

-దున్న మురలీకష్ణ చేనేత కార్మికుడు, యు.కొత్తపల్లి

సహిత విద్యతో సమగ్రాభివృద్ధి : డిఇఒ


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డిఇఒ

ప్రజాశక్తి - ముమ్మిడివరం

సమగ్ర విద్యాభివృద్ధికి సహిత విద్య ఎంతో దోహదపడుతుందని జిల్లా విద్యాశాఖధికారి డాక్టర్ సలీమ్ బాషా పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల జిల్లా కార్యాలయాల ప్రాంగణంలోని ఆడిటోరియం హాలు నందు జిల్లా సహిత విద్యా సమన్వయకర్త ఎంవివి. సత్యనారాయణ అధ్యక్షతన శనివారం సమగ్ర శిక్ష ద్వారా అమలయ్యే సహిత విద్య కార్యక్రమాల నెలవారీ సమీక్షా సదస్సు జరిగింది. డిఇఒ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సేవ చేసే అవకాశం లభించడం గొప్ప అవకాశం అని అన్నారు. వీటిని సమగ్రంగా అమలు చేయడం ద్వారా వారి జీవన ప్రమాణాల్లో మార్పు తీసుకురావచ్చునన్నారు. అంతే కాకుండా ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని, రాబోవు పదో తరగతి పరీక్షల్లో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఇటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. సత్యనారాయణ మాట్లాడుతూ సహిత విద్యా విభాగం అందించే సేవలను, పిల్లలకు అందిస్తున్న సదుపాయాలను వివరించారు. అనంతరం ఇటీవల సహిత విద్యలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఆర్.రమాదేవి, ఎం.స్వర్ణలత లను జిల్లా విద్యాశాఖధికారి చేతులు మీదుగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిఎంఒ బి.సుబ్రహ్మణ్యం, ఎఎంఒ పి.రాంబాబు, ఎఫ్ఎఒ జి.ప్రవీణ్, ఎపిఒ ఎం.భీమారావు, రిసోర్స్ పర్సన్స్ ఎస్.పెద్దిరాజు, ప్రత్యేక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్


పాల్గొన్న ఎంపి హరీష్, ఎంఎల్ఎ సత్యానందరావు

ప్రజాశక్తి - రావులపాలెం

ప్రజాసమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం క్యాంపు కార్యాలయం వద్ద శనివారం ఎంఎల్ఎ సత్యానందరావు, ఎంపి గంటి హరీష్, రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ పివి. గణేష్ కుమార్ ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొన్నారు.ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రాలను ఎంపి హరీష్ మాదుర్, ఎంఎల్ఎ సత్యానందరావు స్వీకరించారు.ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ప్రజా సమస్యల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం కూడా దీనిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని తెలిపారు. అధికారులు, ఉద్యోగులు, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వాసిరెడ్డి రాం బాబు, ఆకుల రామకృష్ణ, పునిగేల రఘురామ్, పాలూరి సత్యానందం, గుత్తుల పట్టాభి రామారావు,చిలువూరి సతీష్ రాజు, అయినవిల్లి సత్తిబాబు గౌడ్, జక్కంపూడి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో 'మహిళా సంరక్షణ'

ప్రజాశక్తి - అల్లవరం

గోడి గురుకుల బాలికల పాఠశాల లో మహిళా సంరక్షణ కార్యక్రమం అమలాపురం రూరల్ సిఐ ప్రశాంత్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సంద్భంగా విద్యార్థినులకు ఈవ్ టీజింగ్, బాలిక భద్రత, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అల్లవరం ఎస్ఐ హరీష్ కుమార్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన


వాడ్రేవుపల్లిలో తడి, పొడి చెత్త సేకరణ పర్యవేక్షిస్తున్న ఇఒపిఆర్‌డి, కార్యదర్శి సింధు

ప్రజాశక్తి - యంత్రాంగం

జిలాల్లో గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణలో భాగంగా అధికారులు పరిసరాల పరిశుభ్రతపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తడి, పొడి చెత్త వేరు చేయడం తదితరఅంశాలపై వివరించారు.

పి.గన్నవరం: వాడ్రేవుపల్లిలో పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాలనుసరించి శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక శానిటేషన్ చర్యలు చేపట్టినట్లు పంచాయతీ కార్యదర్శి మోకా సింధు తెలిపారు. ఇళ్ల నుంచి తడి, పొడి చెత్త వేరు వేరుగా సేకరించి డంపింగ్ యార్డ్ కు తరలించారు. సర్పంచ్ ప్రత్తిపాటి ఉమామహేశ్వరి వెంకటేశ్వరరావు శానిటేషన్ పనులను పర్యవేక్షించారు. ప్రతీ ఇంటి వద్ద తడి, పొడి చెత్త వేరు వేరుగా కేటాయించి పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యవంతమైన సమాజంలో జీవించవచ్చన్నారు.ఆదివారం కూడా ప్రత్యేక శానిటేషన్ పనులు నిర్వహిస్తారని, గ్రామస్తులు పరిసరాల పరిశుభ్రత కి సహకరించాలని కార్యదర్శి సింధు కోరారు.ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకి ప్రాధాన్యత ఇస్తే ఆరోగ్యవంతమైన సమాజంలో జీవించవచ్చని ఇఒపిఆర్‌డి జి.ఉమామహేశ్వరరావు అన్నారు.ముంగండ గ్రామపంచాయతీ పరిధి స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా సర్పంచ్ కుసుమ చంద్రకళ వెంకటేశ్వరరావు అధ్యక్షతన తడి, పొడి చెత్తలపై అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి పి.శ్రీనివాస్ మాట్లాడుతూ తమకు కేటాయించిన చెత్త బకెట్లతో తడి, పొడి చెత్త వేరువేరుగా ఉంచి పంచాయితీ పారిశుధ్య నిర్వహణ ట్రాక్టర్ వచ్చినప్పుడు వారికి అందజేయాలని అన్నారు. ఈ విధంగా చేయటం వల్ల పరిసరాలు పరిశుభ్రత పాటు ఆరోగ్యవంతమైన వాతావరణంలో జీవించవచ్చు అన్నారు. ప్రజలందరూ పరిసరాల పరిశుభ్రతకి అధిక ప్రాధాన్యత ఇచ్చి సహకరించాలని కోరారు.ప్రతి ఒక్కరూ పారిశుధ్య నిర్వహణ వాహనం వచ్చినప్పుడు చెత్తను తడి, పొడిగా కేటాయించి కార్మికులకు అందజేసి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కార్యదర్శి ఎన్‌వివి.సత్య నారాయణమూర్తి ప్రజలకు అవగాహన కల్పించారు. పి.గన్నవరం సర్పంచ్ బొండాడ నాగమణి ఆధ్వర్యంలో శనివారం గ్రామపంచాయతీ పరిధిలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహిం చారు. శివాలయం వీధి, సాయి తేజ కాన్వెంట్, నేలపూడివారి పేట, తాటికాయలవారిపాలెం పలు ప్రాంతాలలో పారిశుధ్య పనులు చేపట్టారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే పల్లెలు పరిశుభ్ర వాతావరణంలో పల్లెల్లు ఆహ్లాదకరంగా మారతాయని, పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తే దోమలవల్ల వచ్చే వ్యాధులు దరిచేరకుండా నివారించవచ్చని కార్యదర్శి అవగాహన కల్పించారు. **కపిలేశ్వరపురం:** ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శానిటేషన్ డ్రైవ్ లో భాగంగా మండల కేంద్రమైన కపిలేశ్వరపురం గ్రామంలో శనివారం పరిసరాలు పరిశుభ్రత, తడి పొడి చెత్త పై పంచాయతీరాజ్ విస్తరణ అధికారి మోహన్, ఎంపిహెచ్ఇఒ జె.మల్లికార్జునుడు గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఇంటింటి నుండి చెత్త సేకరించి, చెత్త నుండి సంపద తయారీ కేంద్రాల వద్దకు తరలించి తడి పొడి చెత్తను వేరు చేయడంపై అవగాహన చేశారు. కార్యక్రమంలో ఎం పి హెచ్ ఈ ఓ జె మల్లికార్జునుడు, గ్రామ కార్యదర్శి శివ చక్రవర్తి, పంచాయతీ సిబ్బంది, సచివాలయం సిబ్బంది, క్లాప్ మిత్రాలు తదితరులు, పాల్గొన్నారు. **అమలాపురం రూరల్:** ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 2 రోజుల ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ లో భాగంగా మండలంలోని నడిపూడి, జనుపల్లి, నల్లమిల్లి గ్రామాలలో పరిసరాలు పరిశుభ్రత, చెత్త నుండి సంపద తయారీ పై పంచాయతీరాజ్ విస్తరణ అధికారి బి.మంగాదేవి శనివారం పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ప్రజలకు అవగాహన కల్పించారు.


కపిలేశ్వరపురంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న విస్తరణ అధికారి మోహన్


నడిపూడి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న విస్తరణ అధికారి

అనంతరం ఇంటింటి నుండి చెత్త సేకరించి, చెత్త నుండి సంపద తయారీ కేంద్రాల వద్దకు తరలించి తడి పొడి చెత్తను వేరు చేయడంపై శిక్షణ ఇచ్చారు. అక్కడ చేసినటువంటి సీక్రిగేషన్ ద్వారా వానపాములను వేసి వర్మి కంపోస్ట్ ని తయారు చేసి ప్రజలకు ఉపయోగకరంగా ఉండే వర్మి కంపోస్ట్ ఎరువును అందుబాటులో ఉంచటం గురించి, ఏ విధంగా నిర్వహిస్తున్నాము అనే విషయాలు అదేవిధంగా మన పరిసరాలను ఎలా పరిశుభ్రంగా ఉంచుకోవాలి, గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దడం గురించి గ్రామపంచాయతీ పరిధిలో, అధికారుల పర్యవేక్షణలో కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చెల్లుబోయిన నాని, గ్రామ కార్యదర్శి బి అనంతలక్ష్మి, పంచాయతీ సిబ్బంది, సచివాలయం సిబ్బంది, క్లాప్ మిత్రాలు తదితరులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం:** ఇళ్లలోని చెత్తను బయట ఎక్కడపడితే అక్కడ పడవేయ వద్దని డివిజనల్ పంచాయతీ అధికారి పి.బుజ్జిరాజు సూచించారు. ఉప్పలగుప్తంలో శనివారం సర్పంచ్ కడిమి చిన్నవరాజు ఆధ్వర్యంలో డివిజనల్ పంచాయతీ అధికారి బుజ్జిరాజు, ఎంపిడిఒ పిఆర్‌సి.రాజ్ కుమార్‌లు గ్రామస్తులకు తడి చెత్త పొడి చెత్త గురించి అవగాహన కల్పించారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి చెత్త వల్ల కలిగే నష్టాలను వివరించారు. దోమల బెడద లేకుండా ఉండాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వారు సూచించారు. పంచాయతీ కార్యదర్శులు తిక్కిరెడ్డి రామకష్ణ, పెట్టా నాగేశ్వరరావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

యాత్రికులతో కిక్కిరిసిన వెంకన్న ఆలయం

ప్రజాశక్తి -ఆత్రేయపురం

కోనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం శనివారం యాత్రికులతో కిక్కిరిసింది. వేకువ జామునే స్వామివారికి సుప్రభాత సేవ అనంతరం యాత్రికులకు దర్శనాలు కల్పించారు. తెలుగు రాష్ట్రాలు ఉండే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి యాత్రికులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణమంతా కిటకిటలాడింది. యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్‌రావు ఏర్పాట్లను పూర్తి చేసి పర్యవేక్షించారు. రాత్రి 9 గంటల వరకు యాత్రికుల రద్దీ కొనసాగింది. ఇబ్బందులు తలెత్తకుండా యాత్రికులకు క్యూలైన్లు ఏర్పాటు చేశారు. స్వామివారికి రూ.46,97,535 సమకూరిందని ఆలయ అధికారి తెలిపారు.


బాధితునికి రమణారావు ఆర్థిక సాయం


శివకు ఆర్థిక సాయం అందజేస్తున్న రమణారావు

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

గోపవరానికి చెందిన వైసిపి కార్యకర్త కొండేపూడి శివ అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. శివ ను శనివారం అమలాపురం నియోజకవర్గం వైసిపి సీనియర్ నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యానికి గురైన శివకు వైద్యం నిమిత్తం రూ.10వేల సాయం అందించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆర్థిక సాయం అందించిన రమణారావుకు ఈ సందర్భంగా శివ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజ్, వైసిపి నాయ కులు నేలపూడి సుగంధ కుమార్,గంటా లక్ష్మీప్రసాద్, పందిరి సుబ్బరాజు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



వేగాయమ్మ పేటవద్ద రోడ్డు ప్రమాదం

- 40 మందికి గాయాలు
- అధిక లోడుతో తిరగబడిన గూడ్స్ వ్యాన్

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలం లోని వేగాయమ్మ పేట వద్ద శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో 40 మందికి గాయాలు అయ్యాయి. మండలంలోని తోటపేట గ్రామానికి చెందిన గాంధీ నగర్ వాసులు కె. గంగవరం మండలం మసకపల్లిలోని ఒక శుభ కార్యక్రమానికి ఒక గూడ్స్ వ్యాన్‌లో ప్రయాణిస్తున్నారు. అయితే మధ్యాహ్నం 1గంట ప్రాంతంలో వేగాయమ్మపేట మలుపు వద్ద సామర్థ్యానికి మించి మనుషులను ఎక్కించడంతోగూడ్స్ వ్యాన్ వెనుక యాక్సిల్ విరిగి రోడ్డుపై తిరగబడింది. అందులో ప్రయాణిస్తున్న మహిళలు, వృద్ధులు, పిల్లలు కింద పడిపోయారు. సమాచారం తెలుసుకున్న ద్రాక్షారామ ఎస్ఐ లక్ష్మణ్ ఘటన స్థలానికి చేరుకుని తన సిబ్బందితో పోలీసు జీపులోను అంబులెన్స్ లోను క్షతగాత్రులను రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. వేగాయంపేట సర్పంచ్ అంబటి తుకారం క్షతగాత్రులకు సహాయం అందించారు. వీరందరినీ రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. వీరిలో నలుగురుకి తీవ్ర గాయాలు కావటంతో వారిని మెరుగైన వైద్యం కోసం కాకినాడ తరలించారు . సూపరిండెండెంట్ డాక్టర్ ప్రవీణ్ ఆధ్వర్యంలో వైద్య బృందం చికిత్స అందించారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ప్రాణాపాయం లేదని వైద్యులు ధ్రువీకరించారు. గాయపడిన వారిని రాష్ట్ర మంత్రి సుభాష్ తండ్రి సత్యం, వైసిపి ఇన్‌ఛార్జి పిల్లి సూర్యప్రకాష్, దళిత నాయకులు ఏరియా ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. గాయపడిన బాధితులను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో పరామర్శించారు.


ప్రమాదానికి కారణమైన గూడ్స్ వ్యాన్

క్షతగాత్రులను పరామర్శించిన ఆర్‌డిఒ అఖిల

వేగాయముపేట రోడ్డు ప్రమాదంలో గాయాలు పాలై చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఆర్‌డిఒ దేవరకొండ అఖిల పరామర్శించారు. ఆమెతోపాటు సబ్ డివిజనల్ పోలీస్ అధికారి రఘువీర్ లు క్షతగాత్రులకు మనోధైర్యాన్ని కల్పించి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను, సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా సంఘటన జరిగిన వివరాలను ఆర్‌డిఒ అడిగి తెలుసుకున్నారు.


వేగాయమ్మ పేట వద్ద రోడ్డుపై పడిపోయిన మహిళలు


క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఆర్‌డిఒ, డిఎస్‌పి తదితరులు

ఆక్వా రైతులపై అదనపు భారం

న్యాయం చేయాలని ఆందోళ

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

అదనపు విద్యుత్ వినియోగానికి అపరాధ రుసుము, కొత్త ట్రాన్స్ ఫార్మర్ల వేసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులు తమకు మోయలేని భారం మోపుతున్నారని ఆక్వా రైతులు విద్యుత్ శాఖ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉప్పలగుప్తం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శనివారం ఆక్వా రైతులు ఆందోళన చేపట్టారు. కష్టాల్లో ఉన్న ఆక్వా చేపల రైతులు ఈ నిబంధనలు సకాలంలో పాటిం చకపోవడంతో చెప్పా పెట్టకుండా విద్యుత్ సరఫరాను నిలుపదలు చేయడంవల్ల చెరువుల్లో రొయ్యలు, చేపలు చనిపోయి నష్టపోతు న్నామంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అదనపు విద్యుత్ వినియోగం పేరుతో భారీగా బిల్లులు మోపుతు న్నారని సకాలంలో చెల్లించని రైతుల విద్యుత్ కనెక్షన్లు కట్ చేయడంతో చేపలు చనిపోతున్నాయన్నారు. చని పోయిన చేపలతో శుక్రవారం రాత్రి సబ్‌స్టేషన్ వద్ద ఆక్వా రైతులు ఆందోళన చేశారు. శనివారం మరో మారు అక్కడే ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ ఎస్ఇ ఎస్.రాజబాబు, టెక్నికల్ ఇఇ వై. విజయనంద్, డిఇ కె.రాంబాబు ఎడిఇ డి.శ్రీనివాస్, ఎఇ టి.శ్రీహరి ఆందోళన చేస్తున్న ఆక్వా రైతుల వద్దకు వచ్చి చర్చలు జరిపారు. తమకు నష్టపరిహారం చెల్లించాలని ఆక్వా రైతులకు డిమా ండ్ చేశారు. జరిగిన నష్టం పై న్యాయపరంగా రైతులను ఆదుకు నేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలి పారు. సకాలంలో విద్యుత్ శాఖ నిబ ంధనలు ముంద స్తుగా తెలపాలని, గడువు ఇవ్వాలని ఆక్వా రైతులు డిమాండ్ చేశారు. ఆందోళ నలో ఆక్వా రైతులు అల్లూరి రమేష్ రాజు, దెందుకూరి సత్తిబాబు రాజు, నిమ్మ కాయల వెంక టేశ్వరావు, కుచ్చర్ల పాటి పెద్దిరాజు, నల్లా బాపండి, గుత్తుల శ్రీనివాస్, చిక్కం సూర్య మోహన్ తదితరులు పాల్గొన్నారు.


విద్యుత్ శాఖ అధికారులకు డిమాండ్ లు తెలుపుతున్న ఆక్వా రైతులు

హోరా హోరీ...



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

పట్టబద్రుల ఎంఎల్‌సి ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థుల ప్రచారం హోరాహోరీగా సాగుతోంది. ఉభయ గోదావరి జిల్లాలో పట్టభద్రుల స్థానానికి ఉమ్మడి ఉభయగోదావరి జల్లాల నుంచి 35 మంది అభ్యర్థులు బరిలో ఉన్న విషయం విధితమే. ప్రధానంగా కూటమి, పిడిఎఫ్ అభ్యర్థుల మద్యే ఈ పోరు జరుగనుందని సుస్పష్టం. కొన్ని గంటల్లో ప్రచార పర్వానికి తెరపడనుంది. మరో 4 రోజుల్లో పోలింగ్ సైతం జరగనుంది. ఈ నేపథ్యంలో అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. గ్రామాలతో మొదలై నియోజక వర్గ కేంద్రాల వరకూ ప్రచారాస్త్రాలకు పదును పెట్టారు. ఓ వైపు ప్రకటనలు, మరోవైపు సోషల్ మీడియాలోనూ ప్రచారాలు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులు తరుపున ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాలు ముమ్మరంగా ప్రచారంలో పాల్గొంటున్నాయి. స్వచ్ఛందంగా వచ్చి రాఘవులును గెలిపించాలని, ఆయన గెలుపు ఆవశ్యకతను వివరిస్తూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. కూటమి అభ్యర్థి మ్రారం కుల, మత సమీకరణల ప్రాతిపదికన ప్రచారాన్ని చేసుకుంటున్నారు. ఈమేరకు నియోజక వర్గ కేంద్రాల్లో సమావేశాలకు సైతం నేటి నుంచి తెరలేపారు. ఈ సమావేశాల మాటున తాయిలాల ఎరవేసేందుకే అనే అనుమానాలు ఇతర అభ్యర్థుల నుంచి వినిపిస్తున్నాయి. కూటమి అభ్యర్థి పట్ల అధికార యంత్రాంగా కూడా సానుకూలంగా వ్యవరించడం పలు విమర్శలకు తావిస్తోంది. మరి చివరి సమయంలో తాయిలాలన ఉన్నతాధికారులు ఎలా అడ్డుకుంటారో వేచి చూడాలి..

మరో వైపు ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్‌కు అధికార యంత్రాంగం రంగం సిద్ధం చేసింది. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇప్పటికే ఓటర్ల జాబితా ప్రకటన, అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారం వంటి ప్రక్రియలను అధికారులు పూర్తి చేశారు. మరో వైపు కొత్త ఓట్ల నమోదుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి యువతను ఓటర్లుగా చేర్చుతున్నారు. రిటర్నింగ్ అధికారుల కేటాయింపు ప్రక్రియ పూర్తయింది. అధికార ప్రతిపక్ష పార్టీలతో ఉన్నతాధికారులు సమావేశాలు నిర్వహించడంతో పాటు రాబోయే ఎన్నికల విధులతో ప్రత్యక్ష సంబంధం ఉన్న పలువురు అధికారులు, ఉద్యోగుల బదిలీలు జరిగాయి. ఎన్నికల కేంద్రాలపైనా ఓ స్పష్టత వచ్చింది. ఓటింగ్ సామగ్రి సైతం రాష్ట్ర ఎన్నికల సంఘం పంపింది. రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షములో వీటిని స్ట్రాంగ్ రూమ్‌లో భద్ర పరిచారు.

పరీక్షా సమయం...

విద్యార్థులలో పరీక్షల ఫియర్ మొదలైంది. మార్చిలో పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఇప్పటికే విద్యాశాఖ ప్రకటించిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో పరీక్షల నిర్వహణకు అధికార యంత్రాంగం రంగం సిద్ధం చేసింది. ఆయా విద్యాసంస్థలు విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేస్తున్నాయి. పదో తరగతి విద్యార్థులకు ఇప్పటికే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న విషయం విధితమే. పదో తరగతి, ఇంటర్మీడియెట్ ఫలితాల్లో గత రెండేళ్లుగా జిల్లా పూర్తిగా వెనుకబడిన విషయం విధితమే. గత పరిస్థితుల నుంచి పాఠాలను తీసుకుని ఈ సారైనా మెరుగైన ఫలితాల దిశగా అడుగులు వేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ముందుగానే మంటలు

వేసవి పూర్తిగా రాకుండానే జిల్లాలో ముందుగానే మంటలు మొదలయ్యాయి. పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారం రోజులుగా ఉష్ణోగ్రతలు 6 నుంచి 8 డిగ్రీల వరకూ పెరిగాయి. భానుని ధాటికి ఉదయం 9 గంటల నుంచి ఎండ తీవ్రత అధికమవుతోంది. మరో వైపు అప్రకటిత విద్యుత్ కోతలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. విద్యుత్ వినియోగం జిల్లాలో 21 మిలియన్ యూనిట్లకు చేరటంతో అప్రకటిత విద్యుత్ కోతలు అనివార్యంగా మారాయి. జిల్లాలో సర్వీసు సంబంధిత సమస్యల పేరుతో అధికారులు మరమ్మతులు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో విద్యుత్ అంతరాయం ఏర్పడటతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

నేరాలు ఘోరాలు

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - కాట్రేనికోన

చెయ్యేరుకు చెందిన కాపు ఉద్యమ నాయకుడు, ఆక్వా రైతు రాష్ట్ర సంఘసలహాదారు త్సవటపల్లి నాగభూషణంను శనివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలు ఇవి.. చెయ్యేరులో కనుమ రోజున చుట్టుపక్కల గ్రామాలనుండి ఏకాదశ రుద్రులు ప్రభలు తరలివస్తాయి. ఆరోజున చెయ్యేరులో ఘనంగా తీర్థం నిర్వహిస్తారు. అనంతరం ప్రభను గ్రామంలోని వీధులగుండా తీసుకు వెళ్లి గ్రామోత్సవం చేస్తారు. ప్రభను తిరిగి తీసుకు వెళ్లేటప్పుడు. ప్రభ ముందు వెళుతున్న వాహనంలో నిర్వాహకులు ఆర్కెస్ట్రాను ఏర్పాటు చేశారు. ఆర్కెస్ట్రాలోని మహిళా కళాకారులు నత్యాలు చేయడంతో పోలీసులు ఆర్కెస్ట్రాను ఆపివేశారు. దీనితో స్థానికులు ప్రభను రోడ్డుకు మధ్యలో నిలిపి పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇలా కొనసాగుతుండగా సుమారు అర్ధరాత్రి సమయంలో అక్కడికి వచ్చిన నాగభూషణం పోలీసులతో వాగ్వాదానికి దిగారని, పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని ఆయనపై పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం ఆయనను అదుపులోకి తీసుకుని కోర్టుకు తరలించారు. అనంతరం వారు బెయిల్‌పై విడుదలయ్యారు.

సారా తయారీదారుడు అరెస్ట్

ప్రజాశక్తి - తాళ్లపూడి

తాళ్లపూడి మండల పరిధిలోని తుపాకుల గూడెం అసైన్డ్ భూమిలో కొవ్వూరు ఎక్సైజ్ సిఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం దాడులు నిర్వహించారు. రాయుడు దానయ్య అనే పాత నేరస్థుడు అసైన్డ్ భూముల్లో రహస్యంగా సారా తయారు చేస్తున్నట్టు గుర్తించారు. రవాణాకు సిద్ధంగా ఉన్న 35 లీటర్ల సారాను, 16 డ్రమ్ముల్లో ఉంచిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. ఐదు కేజీల అమ్మోని యాను స్వాధీనం చేసుకున్నామన్నారు. దానయ్యపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ ఇ.రవికుమార్, సిబ్బంది నారాయణ, నాగేశ్వం౯రావు, సత్యనారాయణ, విఆర్ఓ సాయి పాల్గొన్నారు.


ప్రమాదానికి గురైన లారీ

కాలువలోకి దూసుకెళ్లిన లారీ

ప్రజాశక్తి - కాజులూరు

యానం-ద్రాక్షారమ రహదారిలో గొప్పిరేవు వద్ద శుక్రవారం అర్ధరాత్రి లారీ అదుపుతప్పి వంతెన రైలింగ్‌ను ఢీకొని టేకి కాలువలోకి దూసుకుపోయింది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...యానాం నుంచి ద్రాక్షారామ వైపు వస్తున్న లారీ అదుపు తప్పి వంతెన ఢీకొట్టి కాలువలో పడిపోయింది. కాలువలో నీరు తక్కువగా ఉండటంతో లారీ ఊబిలో కూరుకుపోయింది. లారీ డ్రైవర్, క్లీనర్ పెద్దపెద్ద కేకలు వేయడంతో స్థానికులు గమనించి వారిని బయటకు తీశారు. వారిద్దరు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ప్రమాదానికి గురియైన లారీ కర్ణాటక రాష్ట్రానికి చెందినదిగా గుర్తించినట్లు ఎస్ఐ మోహన్‌కుమార్ తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని వేట్లపాలెం శివారు కెనాల్ రోడ్డుపై బైక్ అదుపుతప్పి పడడంతో సామర్లకోట భాస్కర కాలనీకి చెందిన నగరం సత్తిబాబు (42) శనివారం మృతి చెందాడు. స్థానికుల వివరాలు ప్రకారం... కాకినాడలో ఒక ప్రయివేటు కళాశాలలో పీడీగా పని చేస్తున్న సత్తిబాబు విధులు ముగించుకుని సామర్లకోట ఇంటికి చేరుకున్నాడు. అనంతరం మండలంలోని పెద్ద బ్రహ్మదేవం గ్రామం అత్తారింటికి మోటారు సైకిల్‌పై వెళ్తుండగా సామర్లకోట - ద్వారపూడి కెనాల్ రోడ్డులో బైక్ అదుపు తప్పి రోడ్డుపై పడిపోయాడు. ఈ ప్రమాదంలో అతనికి తీవ్రగాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో ఐదుగురు అరెస్ట్

ప్రజశక్తి-కడియం

పలు నేరాలకు పాల్పడిన ఐదుగురు నిందితులను కడియం పోలీసులు అరెస్టు చేశారని రాజమహేంద్రవరం సౌత్ జోన్ డిఎస్‌పి ఎస్.భవ్యకిషోర్ తెలిపారు. కడియం పోలీస్ స్టేషన్‌లో సిఐ ఎ.వెంకటేశ్వరరావుతో కలిసి శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు.కడియం మండలం జేగురుపాడుకు చెందిన గంగరాజు సత్యవతి జనవరి 18న ఆలయానికి వెళ్లి వస్తుండగా ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఆమె మెడలో ఉన్న బంగారపు నగలను లాక్కుని పారిపోయారు. ఆమె ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన కడియం పోలీసులు ఆ దిశగా దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసులో నిందితులు కొత్తపల్లి త్రిమూర్తులు, కూరాకుల సుబ్బారావు, గాదం శెట్టి వెంకన్న, పచ్చ రాజు, గుమ్మడి సత్యనారాయణమూర్తిలను అరెస్టు చేసినట్టు తెలిపారు. వీరు కడియం, మండపేట రూరల్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో జరిగిన చోరీలతో సంబంధం ఉందన్నారు. వారి నుంచి 58 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు వెండి, ద్విచక్ర వాహనం, కాపర్ వైరు, రూ. 50 వేలు నగదు మొత్తం రూ.5.4 లక్షలు విలువ చేసే సొత్తును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.



వివరాలను వెల్లడిస్తున్న డిఎస్‌పి భవ్యకిశోర్


ప్రారంభిస్తున్న ఎస్ఐ జి.సురేంద్ర పాల్గొన్న భాష్యం స్కూల్ విద్యార్థులు

ఘనంగా ఆటల పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - కొత్తపేట

స్థానిక భాష్యం విద్యాసంస్థ వారి ఆధ్వర్యంలో స్థానిక సిద్ధార్థ కళాశాల ఆవరణ నందు అంబేద్కర్ కోనసీమలో జిల్లా గల భాష్యం విద్యార్థుల ఆటల-పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఇంట్రా జోనల్ స్పోర్ట్స్ మీట్లో పాలకొల్లు, నరసాపురం, మండపేట, అమలాపురం, ముమ్మిడివరం, తాటిపాక, మల్కిపురం, రావులపాలెం, కొత్తపేట భాష్యం విద్యార్థులు పాల్గొన్నారు. సభకు ముఖ్య అతిథులుగా కొత్తపేట ఎస్ఐ జి.సురేంద్ర, ప్రముఖ డాక్టర్ ఎస్‌వి. గాంధీ విచ్చేశారు. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ నేటి పిల్లలు చదువులపై దష్టి పెట్టి ఆటలు మరిచారని దానివలన ఆరోగ్యకరమైన కొన్ని ఇబ్బందులను కూడా ఎదుర్కొంటున్నారన్నారు. పిల్లలకు చదువు, క్రమశిక్షణతో పాటు ఆటలు తగిన వ్యాయామం అవసరమని అన్నారు. చదువుతోపాటు స్పోర్ట్స్ లో రాణించిన కొంతమంది ఐఎఎస్, ఐపిఎస్ అధికారుల గురించి తెలియజేసి పిల్లలను చైతన్యపరిచారు. ముఖ్యఅతిథిగా చేసిన డాక్టర్ గాంధీ మాట్లాడుతూ.. చిన్నతనం నుండి పిల్లలు ఆటపాటలతో ఉల్లాసంగా గడపాలన్నారు. మార్షల్ ఆర్ట్స్ లో ప్రావీణ్యం పొంది శారీరక వ్యాయామం చేయటం వలన ఆరోగ్యంగా ఉంటారని గాంధీ అన్నారు. కొత్తపేట భాష్యం విద్యా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జోనల్ ప్రిన్సిపల్ జెవి.శ్రీనివాస్, ప్రిన్సిపల్ ఎం.లోకేశ్వరరావు, అన్ని బ్రాంచీల ప్రిన్సిపల్స్, పిఇటిలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'బేటీ బచావో- బేటీ పడావో'తో సత్ఫలితాలు

ప్రజాశక్తి - అమలాపురం

బాలికలను రక్షించి బాలికా విద్యను ప్రోత్స హించడంతో పాటు లింగ వివక్షను రూపు మాపేం దుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బేటీ బచావో- బేటీ పడావో కార్యక్రమం ఆశించిన సత్ఫలితాలను అంది స్తోందని జెసి టి.నిషాంతి అన్నారు. శనివారం భేటీ బచా వో- భేటీ పడావో కార్యక్ర మం ప్రారంభించి పది సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక కలెక్టరేట్ నుండి జిల్లా పోలీస్ సూపరింటెం డెంట్ కార్యాలయం వర కు మహిళా సంక్షేమ శాఖ మహిళా పోలీస్ సిబ్బంది తో నిర్వహించిన బైక్ ర్యాలీని తొలుతగా స్థానిక కలెక్టరేట్ వద్ద జెసి ప్రారంభించారు. జాయింట్ కలెక్టర్ మాట్లా డుతూ ఈ కార్యక్రమం ప్రారంభమై జనవరి 22వ తేదీకి పదేళ్లు పూర్తయ్యా యని అన్నారు. జిల్లాల స్థాయిలో ఒకప్పుడు బాలికల శాతం తక్కు వగా ఉండేదని, బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమం ద్వారా కల్పించిన అవగాహనతో ఇప్పుడు వీరి శాతం మెరుగుపడిందని, లింగ వివక్ష తగ్గుతోందని తెలి పారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పథక సంచా లకులు బి.శాంత కుమారి, స్థానిక డి ఎస్‌పి టివిఆర్‌కె.ప్రసాద్, సబ్ ఇన్‌స్పెక్టర్లు, సిడిపిఒలు, మహిళా ఉద్యోగులు మహిళా కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

దృష్టి లోపాల నివారణకు చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - అమలాపురం

ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించుకుంటూ అంధత్వ దష్టిలోపాల నివారణకు చర్యలు చేపట్టాలని జెసి టి.నిషాంతి ఉద్యోగులకు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి భవన్ నందు కలెక్టరేట్ ఉద్యోగుల కోసం కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతినెల ఉద్యోగుల సంక్షేమం కొరకు ఏదో ఒక సంక్షేమ కార్యక్ర మాన్ని అమలు చేయడం జరుగుతుందని దానిలో భాగంగా ఈ నాలుగవ శనివారం ఉద్యోగులకు కంటి వైద్య పరీక్షలు, బిపి మధు మేహం వైద్య పరీక్షలు జిల్లా వైద్య విధాన పరిషత్ వైద్యాధికారుల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఉద్యోగులకు నిర్వహించారు. అంధత్వాన్ని నివారించడానికి కొన్ని చికిత్సలు, కార్యక్రమాలు, అందుబాటులో ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకుంటూ దష్టిలో లోపాలను నివారించు కోవాలన్నారు.అంధత్వాన్ని నివారించడానికి కొత్త చికిత్సలు, ఆశావహమైన చికిత్సలు అందుబాటు లోనికి వచ్చాయన్నారు. అంధత్వం దృష్టి లోపం నివారణకు సంబంధించి ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనలు తప్పనిసరిగా పాటిస్తూ క్రమం తప్పకుండా పాటిస్తూ వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. వయోభారం, మధుమేహం విటమిన్ లోపాలతో కంటి సమస్యలు ఎక్కువగా వస్తాయని అటువంటి ఉద్యోగులు ఈ యొక్క ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆశ్రయించి సద్వినియోగం చేసుకొని సంపూర్ణమైన వైద్య సేవలు పొందాలని ఆమె సూచిం చారు. ఈ కార్యక్రమంలో అంధత్వ నివారణ ప్రోగ్రామింగ్ అధికారి డాక్టర్, ఎ.హేమలత, జిల్లా రెవెన్యూ అధికారి బిఎల్ఎన్.రాజకుమారి, పరిపాలనాధికారి కాశీ విశ్వేశ్వరరావు, సెక్షన్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, ఉప తహశీల్దార్లు బి.చిన్నబాబు వంశీ, శివరాజ్, సిబ్బంది భరత్, రవితేజ పాల్గొన్నారు.


విద్యానిధి స్కూల్లో ఒకే పోలికలతో కనిపిస్తున్న కవల పిల్లలు

ఘనంగా కవలల దినోత్సవం

ప్రజాశక్తి - అమలాపురం

స్థానిక విద్యానిధి పాఠశాలలో శనివారం ఘనంగా కవలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకంగా కవలల విద్యార్థులు ఒక్కచోట చేరి కనువిందు చేశారు. ఈ సందర్భంగా కవల పిల్లలకి పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో విద్యానిధి విద్యాసంస్థల అధినేత ఆకుల బాపన్నాయుడు, ప్రిన్సిపల్ టి.నాగ మాధవి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

బాల బాలాజీకి రూ.3.36 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీస్వామి దేవస్థానానికి శనివారం వివిధ విభాగాల ద్వారా రూ.3,36,920 ఆదాయం వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు శాశ్వత నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.21,748, నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.76,836 ఆదాయం సమకూరిందన్నారు 4,500 మంది స్వామివారిని దర్శనం చేసుకోగా 2,800 అన్న ప్రసాదం స్వీకరించారన్నారు.


రావులపాడు యుపి పాఠశాల్లో ప్రింటర్ బహూకరిస్తున్న దాత మూర్తి

పాఠశాలకు ప్రింటర్ బహూకరణ

ప్రజాశక్తి - రావులపాలెం

రావులపాడు యుపి పాఠశాలకు పవన్ రెడీ మేట్స్ వస్త్ర దుకాణ యజమాని మూర్తి సుమారు రూ.20 వేల విలువైన ప్రింటర్ బహుకరించారు. యుపి పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సునీత అధ్యక్షతన జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఫవన్ రెడీమేడ్స్ యజమమాని మూర్తి, ఉపాధ్యాయులు ఎస్ జ్యోతిబసు పాల్గొన్నారు. అనంతరం సునీత మాట్లాడుతూ ఈ ప్రింటర్ వల్ల విద్యార్థులకు ఎన్నో పాఠ్యాంశాలకు సంబంధించిన విషయాలు ప్రింట్ తీసి బోధించటానికి ఉపాధ్యాయులుకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.సేవా భావం కలిగిన ఫవన్ రెడీమేడ్స్ యజమాని మూర్తికి విద్యార్థులు, ఉపాధ్యాయులు తరుపున కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కెవి.శేఖర్, శ్యామల కుమారి, వీరవేణి, మేరీ జోన్స్, హిమజ, వెంకటలక్ష్మి, పద్మజ, విద్యార్థులు పాల్గొన్నారు.


గ్రామంలో పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కార్యదర్శి

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి - రావులపాలెం

శానిటేషన్ డ్రైవ్ లో భాగంగా మండల పరిధి గోపాలపురం గ్రామంలో పరిసరాలు పరిశుభ్రత, చెత్త నుండి సంపద తయారీ పై కార్యదర్శి నిమ్మకాయల సాయిరాం, సర్పంచ్ సబ్బితి మోహన్ రావు శనివారం ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఇంటింటి నుంచి చెత్త సేకరించి, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల వద్దకు తరలించి తడి పొడి చెత్తను వేరు చేయడంపై శిక్షణ ఇచ్చారు. అక్కడ చేసినటు వంటి సీక్రిగేషన్ ద్వారా వానపాములను వేసి వర్మీ కంపోస్ట్ ని తయారు చేసి ప్రజలకు ఉపయోగకరంగా ఉండే వర్మి కంపోస్ట్ ఎరువును అందుబాటులో ఉంచటం తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వలీబాబా దర్గాను సందర్శించిన పుల్లెల గోపీచంద్

ప్రజాశక్తి - ముమ్మిడివరం


సందర్శించిన గోపిచంద్

ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్ ప్రసిద్ధి గాంచిన కొత్తలంక వలీ బాబా దర్గాను శనివారం సందర్శించి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గా సందర్శనకు వచ్చిన గోపిచంద్ కు దర్గా కమిటీ సభ్యులు గేదెల రఘునాథ బాబు ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దర్గా విశిష్టతను వివరించారు. అనంతరం బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్ కు దుశాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ స్కౌట్స్, గైడ్స్ డే

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మాచర పిఎంశ్రీ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రపంచ స్కౌట్స్ అండ్ గైడ్స్ డే ను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని రమాదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమానికి ఆద్యుడు రాబర్ట్ స్టీఫెన్ స్మిత్ భేడెన్ పవేల్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎంపికైన విద్యార్థిని, విద్యార్థులు మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం.రమాదేవి మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమానికి ముఖ్యంగా సేవ, సచ్ఛీలం, ఆరోగ్యం, హస్త కళలు అనేవి నాలుగు మూలస్తంభాలుగా ఉన్నాయన్నారు. ఇటీవల తమ పిఎంశ్రీ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులకు వారం రోజుల పాటు స్కౌట్స్ అండ్ గైడ్స్ లో శిక్షణిచ్చారని అన్నారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు పాఠశాలలోని 32 మంది చొప్పున విద్యార్థిని విద్యార్థులకు శిక్షణిస్తూ సేవా కార్యక్రమాలు చేస్తారని సేవా కార్యక్రమాలు చేస్తారన్నారు. ప్రతీ రోజు స్కౌట్ విద్యార్థులు మంచి పని చేయాలన్న లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రమాదేవి, స్కౌట్ గ్రైడ్స్ ఉపాధ్యాయులు రాయుడు ఉదయ్ కుమార్, మందా శిరోమణి, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.


మాచర ఉన్నత పాఠశాలలో స్కౌట్, గైడ్స్‌లో పాల్గొన్న విద్యార్థిని, విద్యార్థులు


బాధితులను పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు నూకల బలరాం తదితరులు

క్షతగాత్రులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని వేగాయమ్మ పేట వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రులు 40 మందిని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను సిపిఎం నాయకులు నూకల బలరాం తదితరులు పరామర్శించారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని, అదేవిధంగా ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని అన్నారు. వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్న దళితులను ప్రభుత్వం వెంటనే ఆదుకుని వారికి మెరుగైన వైద్యంతో పాటు నష్టపరిహారం చెల్లించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నూకల బలరాం, తోపాటు కె.సత్తిబాబు, రాజు, చైతన్య,గోవిందు తదితరులు బాధితులను పరామర్శించిన వారిలో ఉన్నారు.

ఆదిత్యలో యూత్ లీడర్‌షిప్ వర్క్ షాప్

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలో రోటరాక్ట్ క్లబ్ ఆధ్వర్యంలో యూత్ లీడర్‌షిప్‌పై వర్క్ షాప్ జరిగింది. ఈ కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకులు సలాది శ్రీరామచంద్రమూర్తి, సిఐ ఆర్. అంకబాబు పాల్గొని మాట్లాడారు. నాయకత్వం, ప్రేరణ, దేశ నిర్మాణంపై వారు వివరించారు. విద్యార్థుల వ్యక్తిగత, వృత్తిపరమైన వృద్ధికి సాధికారత గల అంశాలపై చర్చింరాఉ. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ డిప్యూటీ ప్రో. ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎంబి.శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, డీన్ క్యాంపస్ లైఫ్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ వి.సత్యనారాయణ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వరప్రసాద్, రోట్రాక్ట్ క్లబ్ సభ్యులు వివి.శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.


ఆలయ ఈఒకు వెండిచీర ఆభరణాన్ని అందజేస్తున్న పేరూరి దంపతులు

అమ్మవారికి రెండున్నర కేజీల వెండిచీర అందజేత

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని మూలస్థానంలోని శ్రీ ఉమా మూలేశ్వరస్వామి దేవస్థానంలో ఉమాదేవి అమ్మవారికి గ్రామానికి చెందిన పేరూరి వంశీకులు, పేరూరి మహేందర్ నాథ్ దంపతులు కలిసి రూ. 3 లక్షల విలువైన 2.5 కిలోల వెండి చీర ఆభరణాన్ని శనివారం ఆలయ ఇఒ ఎమ్.శివరామకృష్ణకు అందజేశారు. దీంతో ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో దాతల చేత ప్రత్యేక పూజలు నిర్వహించి వెండి చీర ఆభరణాన్ని అమ్మవారికి అలంకరింపజేశారు. అలాగే గ్రామ పెద్దలు, పలువురు నేతలు దాతలను అభినందించారు.

సెల్ టవర్ నిర్మాణ పనులను నిలిపివేయాలి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

పట్టణంలోని ఐబిసి కాలనీలో ఏర్పాటు చేస్తున్న ఎయిర్ టెల్ సెల్ టవర్ నిర్మాణ పనులను నిలిపివేయాలని ఆ ప్రాంత ప్రజలు నగర పంచాయితీ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. సెల్ టవర్ నిర్మాణం వల్ల మా ప్రాంత ప్రజలకు అనేక అనారోగ్య సమస్యలు ఏర్పడే అవకాశం ఉందని కావున ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకుని సెల్ టవర్ నిర్మాణ పనులను నిలిపివేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ ఎ.గోవిందు, రాజానాల లక్ష్మీమూర్తి, ఎల్లా శ్రీను, బస కామాబాబు, మొరాశెట్టి కామేష్ పాల్గొన్నారు.

ముమ్మరంగా రైతు గుర్తింపు సంఖ్య నమోదు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలో రైతు గుర్తింపు సంఖ్య రిజిస్ట్రేషన్ ముమ్మురంగా కొనసాగుతుందని మండల వ్యవసాయ అధికారి సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మండల పరిధిలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఈ నమోదు ప్రక్రియ ముమ్మురంగా కొనసాగుతుందన్నారు. రైతులందరూ తమ పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు.